
సాక్షి బాపట్ల

గురువారం । 16 । ఫిబ్రవరి । 2023



పులిచింతల నీటి నిల్వ


అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 43.0610 టీఎంసీలు. ఎగువ నుంచి 2,200 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 2000 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద 2,423 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1,217 క్యూసెక్కులు విడుదలయ్యాయి.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

వైభవం మల్లేశ్వరుడి గ్రామోత్సవం

రుద్రాక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన స్వామి



మంగళగిరి: నగరంలో వేంచేసిఉన్న గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు బుధవారం స్వామి వారు రుద్రాక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా కూడళ్లలో భక్తులు మల్లేశ్వరుడిని దర్శించుకుని టెంకాయలు సమర్పించుకుని హారతులిచ్చారు. దేవస్థానం వద్ద నుంచి ప్రారంభమైన స్వామి గ్రామోత్సవం మెయిన్ బజారు మీదుగా శాసన స్తంభం, పూలమార్కెట్ మీదుగా మిద్దె సెంటర్‌కు చేరుకుంది. అనంతరం అక్కడి నుంచి పెదకోనేరు మీదుగా తిరిగి దేవస్థానానికి చేరింది. నగరానికి చెందిన పొట్టి పానకాల గుప్తా, ఉదయ శ్రీనివాస్, మురళీకృష్ణ, ఉదయ్‌కుమార్, బాలగంగాధర్ గుప్తా, రంగ సత్యనారాయణ తదితరులు రుద్రాక్ష వాహన ఉత్సవానికి కై ంకర్యపరులుగా వ్యవహరించారు. దేవస్థాన ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 556.90 అడుగుల వద్ద ఉంది. ఇది 225.2367 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 10,040, ఎడమ కాలువకు 8,629, ప్రధాన కాలువకు 21,235, ఎస్ఎల్‌బీసీకి 2,200, వరద కాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 42,424 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 29,796 క్యూసెక్కుల నీరు వచ్చిచేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 832.50 అడుగుల వద్ద ఉంది. ఇది 52.1476 టీఎంసీలకు సమానం.

యార్డులో 1,38,237 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,30,195 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,38,237 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,000 నుంచి రూ.21,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,000 నుంచి రూ.25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.12,500 వరకు ధర దక్కింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 86,336 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

దుర్గమ్మ సేవలో మంత్రి కారుమూరి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలుదీరిన దుర్గమ్మను రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు బుధవారం దర్శించుకున్నారు. మంత్రి నాగేశ్వరరావు దంపతులకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం వేద పండితులు ఆశీర్వదించారు. ఆలయ అర్చకులు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలు మంత్రికి అందజేశారు.

కర్మ వీరులు.. కష్టజీవులు

- వివిధ రాష్ట్రాల నుంచి వలస వచ్చి ఉపాధి పొందుతున్న కార్మికులు
- బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో 42 వరకు గ్రానైట్ క్వారీలు
- బల్లికురవ, సంతమాగులూరు, మార్టూరు మండలాల్లో 1600 వరకు గ్రానైట్ పరిశ్రమలు
- క్వారీలకు సమీపంలోనే కార్మికులకు వసతి గృహాలు



ఈర్లకొండ క్వారీలో పనుల్లో కార్మికులు



గ్రానైట్ శ్లాబులను లారీకి లోడింగ్ చేస్తున్న కార్మికులు

బల్లికురవ: పొట్టకూటి కోసం ఊరుకాని ఊరు వచ్చి జీవనం సాగిస్తున్నారు. బతుకు కోసం మెతుకు కోసం శారీరక శ్రమను నమ్ముకున్న కష్టజీవులు. శ్రీశ్రీ అన్నట్లుగా ఘర్మజలానికి, ధర్మజలానికి, ఘర్మజలానికి ఖరీదు లేదోయ్! అని వారికి వారే సాటిగా పనిచేస్తున్నారు గ్రానైట్ కార్మికులు. ఇంటి నిర్మాణంలో వాడే ఫ్లోరింగ్, టేబుల్, కిచెన్‌టాప్స్ తయారీకి వినియోగించే గ్రానైట్ రాళ్ల క్వారీల పరిశ్రమల్లో పనిచేస్తూ వేలాది మంది దశాబ్దాలుగా ఉపాధి పొందుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు బతుకుదెరువు కోసం ఒడిశా, బీహార్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు చెందిన కార్మికులు క్వారీలు, ఫ్యాక్టరీల్లో సుమారు లక్ష మంది వరకు పనులు చేస్తున్నారు. బాపట్ల జిల్లా బల్లికురవ మండలంలోని కొణిదెన రెవెన్యూలో ఉన్న ఈర్లకొండ, మల్లాయపాలెం, బల్లికురవ, రెవెనన్యూలోని ఏనుగు కొండల్లో 22 క్వారీలు ఉన్నారు. సంతమాగులూరు మండలంలోని గురిజేపల్లి సమీపంలో 20 క్వారీలు ఉన్నాయి. బల్లికురవ, సంతమాగులూరు, మార్టూరు మండలాల్లో సుమారు 1600 వరకు పరిశ్రమలు ఉన్నాయి.

ఇతర దేశాలకు, నగరాలకు ఎగుమతి..

బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లోని క్వారీల్లో లభించే స్టీల్ గ్రేబ్లాక్ పెరల్, కట్టర్ సైజు రాళ్లు చైనా, జపాన్, యూరప్, పశ్చిమాసియా, హైదరాబాద్, బెంగళూరు, తాడిపర్తి, అనంతపురంతో పాటు లోకల్ పరిశ్రమలకు ముడిరాయి, కట్టర్ సైజులు ఎగుమతి జరుగుతున్నాయి. ఒక్కో క్వారీలో 50 నుంచి 70 మంది వరకు కార్మికులు, 15 నుంచి 20 మంది వరకు ఫీల్డ్ స్టాఫ్, పరిశ్రమల్లో 40 నుంచి 50 మంది వరకు కార్మికులు, 10 నుంచి 15 నుంచి స్టాఫ్ పని చేస్తున్నారు.

క్వారీలు, పరిశ్రమలకు సమీపంలోనే మకాం..

క్వారీల్లో పనిచేసే వివిధ రాష్ట్రాల కార్మికులకు క్వారీలకు సమీపంలోనే వసతి గృహాలు నిర్మించారు. ఒక్కో వసతి గృహంలో 5 నుంచి 6 మంది వరకు ఉంటున్నారు. ఈ వసతి గృహాలకు క్వారీ యజమాన్యాలే అద్దె చెల్లిస్తున్నారు. క్వారీలకు సమీపంలోని ఆయా గ్రామాల్లోని రైతులు పొలాల్లో ఒకే మైదానంలో 10 నుంచి 15 షెడ్ల వరకు ఏర్పాటు చేశారు. దీంతో కార్మికులు అందుబాటులోనే ఉంటూ రోజుకు రెండు షిఫ్టుల్లో 16 గంటలు, కాంట్రాక్టుగా మీటరు వంతున రాయి తీస్తూ ఒక్కో కార్మికుడు రోజుకు రూ.600 నుంచి రూ.800 వరకు సంపాదిస్తున్నారు.

లోడింగ్ పనుల్లోనూ..

పరిశ్రమల్లో పరుపురాళ్లు తయారు చేయడానికి అడుగుకు రూ.6 నుంచి రూ.7 యజమానులు చెల్లిస్తున్నారు. ఒక్కో కార్మికుడు రోజుకు 90 నుంచి 100 అడుగుల రాయి తయారు చేస్తున్నాడు. ఇదికాక లారీలకు లోడు చేసినందుకు అడుగుల లెక్కన చెల్లిస్తారు. క్వారీల్లో పెద్ద బండలు కావడం వల్ల వీల్ లోడర్, పొక్లెయిన్‌తో లోడింగ్ జరుగుతున్నాయి. రాష్ట్రాలు దాటి వచ్చిన కార్మికులకు సైతం ఇక్కడి గ్రానైట్, క్వారీలు, పరిశ్రమలు ఉపాధినివ్వడంతో పాటు ఇక్కడ నుంచి ఎగుమతులతో ప్రపంచ దేశాల్లో కూడా బల్లికురవకు ప్రత్యేక గుర్తింపు ఉంది.

కరోనా రోజుల్లో ప్రభుత్వం ఆదుకుంది



ఆరేళ్లుగా ఇక్కడ పనిచేస్తున్నారు. కరోనా విపత్తులో ప్రభుత్వం, క్వారీ యజమాన్యం, అధికారులు మాకు చేయూతనిచ్చారు. ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసి మా స్వగ్రామాలకు పంపారు. కరోనా తగ్గుముఖం పట్టాక తిరిగి వచ్చాను.

– సునీల్ కుమార్, ఒడిశా

15 సంవత్సరాలుగా పనిచేస్తున్నా..



ఇక్కడ క్వారీల్లో పనిచేసేందుకు 15 ఏళ్ల క్రితం వచ్చాను. భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. సంపాదించిన డబ్బులు ఇంటికి పంపిస్తాం. సంవత్సరానికి రెండుసార్లు మాత్రమే స్వగ్రామం వెళ్తున్నాను.

– రామ్‌చరణ్, మధ్యప్రదేశ్

పనులతో ఇంటినే మరచిపోతున్నాం..



మా రాష్ట్రం నుంచి వచ్చి నవారమంతా ఒకే చోట కలిసి మెలిసి ఉంటూ పనులు చేయడం వల్ల ఇంటినే మరిచిపోతున్నాం. తల్లిదండ్రుల పోషణకు నెలనెల డబ్బు పంపిస్తూ ఖాళీ సమయాల్లో యోగక్షేమాలు విచారిస్తున్నాను.

– ప్రదీప్‌కుమార్, మధ్యప్రదేశ్

రూ.20 వేల వరకు సంపాదిస్తున్నాను



ఒడిశా ప్రాంతం నుంచి ఐదేళ్ల క్రితం ఇక్కడి క్వారీల్లో పనిచేసేందుకు వచ్చాను. నెలకు రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకు సంపాదిస్తున్నాను. దీనిలో ఖర్చులు పోనూ నెలకు రూ.12 వేలు ఇంటికి పంపగలుగుతున్నాను.

– తుకానా గౌడ్, ఒడిషా

ఎప్పటికప్పుడు శిక్షణ ఇస్తున్నాం..

కార్మికుల భద్రత, బాధ్యతలపై కొత్త కార్మికులకు శిక్షణ ఇప్పిస్తున్నాం. క్వారీల్లో నిత్యం అప్రమత్తతతో పనులు చేయాల్సిఉంటుంది. అప్పుడే ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చు.

– జగన్నాథరావు, మైన్స్ డీడీ

నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యం



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్


చీరాల: మండలంలో పదో తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. బుధవారం పట్టణంలోని కస్తూర్బా గాంధీ పురపాలక బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్న వయస్సులోనే జీవిత లక్ష్యాలను ఎంపిక చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు పాఠాలు బాగా చెబుతున్నారని తెలుసుకొని అభినందించారు. ఇదే స్ఫూర్తితో పదో తరగతిలో ఉన్నత ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి పి.రామారావు, మున్సిపల్ కమిషనర్ ఐసయ్య, తహసీల్దార్ జి.ప్రభాకర్, ప్రధానోపాధ్యాయులు కృష్ణమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టర్‌కు వినతి

చీరాల రూరల్: నియోజకవర్గంలో దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోకుండా ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ చీరాల నియోజకవర్గ అభివృద్ధి సాధనా సమితి నాయకులు కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతి పత్రం అందించారు. బుధవారం చీరాల విచ్చేసిన కలెక్టర్ విజయ కృష్ణన్‌ను నియోజకవర్గ అభివృద్ధి సాధన సమితి సభ్యులు శీలం రవికుమార్ మరికొందరు సభ్యులు కలిసి పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనేక ఏళ్లుగా కుందేరు కాలువ అభివృద్ధికి నోచుకోకుండా ఆక్రమణలకు గురవుతోందని, అనేక మంది ఆ స్థలాలను కబ్జా చేసి లక్షలాది రూపాయలకు విక్రయించి జేబులు నింపుకుంటున్నారని తెలిపారు. కుందేరు కాలువ ఆక్రమణలకు గురికాకుండా తక్షణమే కాలువకు రెండు వైపులా బౌండరీలను గుర్తించి రక్షణ కంచెలు వేయించాలని విన్నవించారు. ప్రైవేట్ బస్సుల యజమానులు ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్సులను నిలిచి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని, ట్రాఫిక్‌కు కూడా తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారని ఫిర్యాదు చేశారు. పట్టణంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ విక్రయాలు జరుగుతున్నాయని, దానికి అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కొన్ని ప్రాంతాల్లో శ్మశానాల కోసం స్థలాలు కేటాయించాలని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తానని కలెక్టర్ విజయకృష్ణన్ నియోజకవర్గ సాధన సమితి సభ్యులకు హామీ ఇచ్చారు.

ఆనందరూపం.. అర్ధనారీశ్వరం

- దేశంలోనే తొలి అర్ధనారీశ్వర శివలింగం
- పెదకొండూరులో క్రీ.శ. 4వ శతాబ్దిలో నిర్మాణం
- ఈశ్వరతత్వానికి ప్రతీక
- 1700 సంవత్సరాల క్రితం మలిచిన శివరూపం



అర్ధనారీశ్వర శివలింగం



విగ్రహం చెంత డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

తెనాలి: శిరస్సుపై నాగాభరణం.. దిగువన అర్ధనారీశ్వర రూపం.. కుడివైపున కపాలముల మాల, త్రిశూలం, చెవికి సర్పకుండలం ధరించిన శివరూపం. ఎడమవైపు సగాన అందెలు, పూలమాల, చేతులకు కంకణాలు వంటి అలంకారంపై పార్వతి రూపం. మొత్తంమీద.. శివుడు పార్వతీ సమేతుడై ఆవిర్భవించినట్టు అక్కడి శివలింగం దర్శనమిస్తోంది. పార్వతీదేవికి శివుడిపై గల ప్రేమకు పరమావధి భర్త శరీరంలో సగభాగాన్ని పొందటమే. అందువల్లే ఈ శివలింగం సార్థకనామం కలదిగా చరిత్రకారుల భావన.

విలక్షణ శివలింగం..

శివలింగాలు నిరాకారంగా నిర్గుణసూచకంగా ఉండాలనే శైవాగమ శాస్త్రానికి భిన్నంగా విలక్షణమైన ఈ అర్ధనారీశ్వర శివలింగం, పవిత్ర కృష్ణానదీ తీరాన దుగ్గిరాల మండల గ్రామం పెదకొండూరులోగల ఆనందేశ్వరాలయంలో కొలువైఉంది. వేదాంతపరంగా చూస్తే, ఇందులో శివశక్తుల రూపం అద్వైత భావనకు ప్రతీకగా ఈశ్వరతత్వాన్ని చూపినట్టు చెబుతారు. శివాద్వైతం- శాక్తాద్వైతం ఇందులో మిళితమై ఉన్నాయి. శక్తి ఈశ్వరుడిలో మిళితమై ఉన్నప్పుడు ఈశ్వరాద్వైతమే మిగులుతుందని చెబుతారు. క్రీ.శ.4వ శతాబ్దినాటిది అంటే 1700 ఏళ్ల నాటి ఈ విలక్షణ శివలింగం దేశంలోనే తొలిదని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి వెల్లడించారు.

పాలరాతితో మలచిన రూపు

ఈ శిల్పం ఉనికిని గురించి ప్రముఖ చరిత్రకారుడు పీవీ పరబ్రహ్మశాస్త్రి గతంలో ఇచ్చిన సమాచారం ప్రకారం బుధవారం డాక్టర్ శివనాగిరెడ్డి బుధవారం ఆలయాన్ని సందర్శించారు. అక్కడి శాసనాలను చదివి వివరాలను వెల్లడించారు. క్రీ.శ. 4వ శతాబ్దిలో గుంటూరు జిల్లా చేజర్ల, కంతేరుల నుంచి ఈ ప్రాంతాన్ని పాలించిన ఆనంద గోత్రినులనే రాజులు, పెదకొండూరులో ఆనందేశ్వరాలయాన్ని నిర్మించారు. పల్నాటి సున్నపురాతి శివలింగంపై ముందుభాగాన సగం శివుడు, సగం పార్వతిని ప్రకృతి, పురుషుల కలయికగా అర్ధనారీశ్వర శిల్పాన్ని చెక్కించారు. అర్ధనారీశ్వర శిల్పమున్న ఈ శివలింగం దేశంలోనే మొదటిదన్నారు. బౌద్ధమతానికి ప్రతీకగా శైవమతాన్ని ప్రచారంలోకి తీసుకొచ్చిన 4వ శతాబ్దిలోనే దీనిని నిర్మించినట్టు తెలిపారు. బౌద్ధ విగ్రహాల నిర్మాణాలకు వినియోగించిన పాలరాతితో ఈ శివలింగాన్ని మలిచారు. అమరావతి బౌద్ధశిల్పాలు, అమరేశ్వర స్వామి, ఆ ప్రాంతంలోని మరికొన్ని శిల్పఖండాలు ఇదే తెల్లరాతితో రూపొందించారు. పెదకొండూరు ప్రాంతంలో ఆనందేశ్వరుడు మినహా మరే తెల్లరాతి విగ్రహం లేదు.

చారిత్రక ప్రాశస్త్యాన్ని తెలియజెప్పాలి

ఆలయ ప్రాంగణంలో క్రీ.శ. 12వ శతాబ్దినాటి బ్రహ్మ, సరస్వతి, మహిషాసురమర్దిని, సూర్యవిగ్రహాలు, క్రీ.శ. 1170, 1173, 1317 నాటి శాసనాలున్నాయి. ఆ శాసనాలను పీఠాలపై నిలబెట్టి వాటి చారిత్రక ప్రాశస్త్యాన్ని తెలియజెప్పే నామఫలకాన్ని ఏర్పాటు చేయాలని డాక్టర్ శివనాగిరెడ్డి గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వేగంగా రీ-సర్వే ప్రక్రియ

- 82 గ్రామాల్లో సర్వే పూర్తి
- ఇప్పటికే 13,723 మందికి భూహక్కు పత్రాలు
- 1700 సర్వే నంబర్లలో డాటెడ్ ల్యాండ్స్ క్లియర్
- 3 వేల మందికి లంక భూములు
- 52 గ్రామాల పరిధిలో ఎస్సీ కాలనీలకు శ్మశాన వాటికలు
- సాక్షితో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు



సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో రీ-సర్వే వేగంగా జరుగుతోందని జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. గ్రామాల్లో డాటెడ్ ల్యాండ్స్‌ను క్లియర్ చేస్తున్నామని, అర్హులైన వారికి లంకభూములు, సాగు చేసుకునే రైతులకు సొసైటీ భూములను పంపిణీ చేస్తున్నామన్నారు. ఎస్సీ కాలనీలకు శ్మశాన వాటికల కోసం స్థలం కేటాయిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలను బుధవారం జాయింట్ కలెక్టర్ సాక్షికి వివరించారు.


- 82 గ్రామాల పరిధిలో డ్రోన్ సర్వే చేశాం. 55 గ్రామాలకు సంబంధించి ఓఆర్ఐ మ్యాపులు సిద్ధమయ్యాయి. 29 గ్రామాల్లో సర్వే పూర్తయింది. 23 గ్రామాల పరిధిలో 13,723 భూహక్కు పత్రాలు రాగా, 10,371 పత్రాలు పంపిణీ చేశాం. మిగిలిన వారికి పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది.
- రికార్డుల్లో ఒకరి పేరుంటే భూమిపై మరొకరు ఉండటం, తల్లిదండ్రులు మరణించినా వారి వారసుల పేరున భూములు మారకపోవడం, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కావడం లాంటి సమస్యలు అధికంగా కనిపించాయి.
- సర్వే ద్వారా అన్ని రకాల భూ సంబంధిత సమస్యలను పరిష్కరిస్తున్నాం. హక్కు కలిగిన యజమానుల పేర్లను రికార్డుల్లో చేర్చి వారికి భూమిపై హక్కులు కలిస్తున్నాం.
- సర్వేను ప్రత్యేక ప్రణాళికతో వేగవంతం చేశాం. ఇప్పటి వరకు జరిగిన రీ-సర్వేతో పాటు ముందస్తుగా 12 మండలాల పరిధిలో 9 లక్షల సర్వే నంబర్లు ఉండగా ఇప్పటికే 1.30 లక్షల సర్వే నంబర్లను, వెరిఫై చేశాం. తద్వారా అక్కడి సమస్యలను గుర్తించాం. దీంతో జరగబోయే రీ-సర్వే సులభతరమవుతుంది.
- రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పొరపాటున చుక్కల భూములుగా మారిన 1700 సర్వే నంబర్లను క్లియర్ చేశాం. దీనివల్ల రైతుల ఇబ్బందులు చాలావరకు తొలగించనున్నాం.

లంక భూముల విషయంలో తీసుకున్న చర్యలు..

- కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో 1100 ఎకరాల లంక భూములను 3 వేల మందికి పంపిణీ చేస్తున్నాం.
- బాపట్ల, రేపల్లె, పర్చూరు, చినగంజాం, అద్దంకి తదితర మండలాల పరిధిలో సాగు చేసుకుంటున్న సొసైటీ భూములను 3 వేల మందికి పట్టాలు ఇస్తున్నాం.
- జిల్లా వ్యాప్తంగా 52 గ్రామాల పరిధిలో ఎస్సీ కాలనీలకు శ్మశాన వాటికల కోసం 45 ఎకరాలను ఇస్తున్నాం. దీంతో శ్మశానవాటికల సమస్య తీరనుంది.

సాయుధ దళాల సేవలు కీలకం

- ఆరు రకాల అత్యాధునిక ఆయుధాలతో 70 రౌండ్లు ఫైరింగ్ చేసిన ఎస్పీ
- ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణకు ఎల్లవేళలా సంసిద్ధంగా ఉండాలి
- వార్షిక ఫైరింగ్ సాధన ప్రక్రియను ప్రారంభించిన జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



ఫైరింగ్ చేస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్లటౌన్: శాంతిభద్రతల పరిరక్షణలో సాయుధ దళాల సేవలు కీలకమైనవని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ప్రకాశం జిల్లా చీమకుర్తిలోని ఫైరింగ్ రేంజ్‌లో రెండు రోజుల పాటు జరిగే బాపట్ల జిల్లా సాయుధ బలగాల వార్షిక ఫైరింగ్ శిక్షణను బుధవారం ఎస్పీ వకుల్‌జిందాల్ ప్రారంభించారు. తొలుత 6 రకాల అత్యాధునిక ఆయుధాలతో 70 రౌండ్‌లు ఫైరింగ్ చేసి సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ప్రజలు, ప్రభుత్వ ధన, మాన, ప్రాణ రక్షణకు ఎల్లవేళలా సంసిద్ధులై ఉండాలన్నారు. నీల్ పొజిషన్, స్టాండింగ్ పొజిషన్‌పై వివరించారు. ఫైరింగ్‌లో ఉన్న అనుమానాలు, సందేహాలను నివృత్తి చేశారు. ప్రతి ఒక్క బుల్లెట్టు లక్ష్యాన్ని తప్పకుండా తర్ఫీదు పొందాలన్నారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని జిల్లా పోలీసు శాఖ ఔన్నత్యాన్ని కాపాడాలని పేర్కొన్నారు. కొత్తగా వచ్చిన ఆయుధాల గురించి పూర్తి స్థాయిలో తర్ఫీదు పొంది, అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్, జిల్లా ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్‌కుమార్, బాపట్ల డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు, చీరాల డీఎస్పీ పి.శ్రీకాంత్, బాపట్ల ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్, అడ్మిన్ ఆర్ఐ ఎల్.మన్మధరావు, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్ నాయక్ పాల్గొన్నారు.

19న ఎస్ఐ పోస్టుల ప్రిలిమినరీ పరీక్ష

ప్రత్యేక సమావేశంలో గుంటూరు రేంజ్ ఐజీ వెల్లడి

నగరంపాలెం(గుంటూరు): ఏపీ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో జిల్లాలో జరగనున్న సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని గుంటూరు రేంజ్ ఐజీ డాక్టర్ సీఎం త్రివిక్రమవర్మ ఆదేశించారు. నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని స్పందన హాలులో ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్లపై బుధవారం ఐజీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష జరగనుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 23 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. అభ్యర్థుల హాల్ టికెట్, గుర్తింపు కార్డు, నలుపు/బ్లూ పెన్‌లను అనుమతిస్తారన్నారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను లోనికి అనుమతించేదిలేదని పేర్కొన్నారు. సమావేశంలో ఏఎస్పీలు కె.సుప్రజ (పరిపాలన), అనీల్‌కుమార్ (ఎల్‌అండ్‌ఓ), ఎ.శ్రీనివాసరావు (క్రైం), కె.కోటేశ్వరరావు (ఏఆర్), ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ ఆచార్యులు/పరీక్షల సమన్వయకర్త సిద్దయ్య, చీఫ్ ఇన్విజిలేటర్లు, సూపరింటెండెంట్‌లు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

ముస్తాబైన గోవాడ శైవక్షేత్రం

- బాపట్ల జిల్లాలో ప్రసిద్ధి
- ఐదు రోజులు ఉత్సవాల నిర్వహణ ఇక్కడ ప్రత్యేకం
- పూర్తి గ్రామీణ వాతావరణం, పచ్చటి పొలాల మధ్య పండుగ
- లక్షలాదిగా తరలిరానున్న భక్తులు
- పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



గోవాడలో బాల కోటేశ్వర స్వామి దేవస్థానం ముఖ ద్వారం



గోవాడ గ్రామంలో బాల కోటేశ్వర స్వామి దేవస్థానం



ఆలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లు

గోవాడ (వేమూరు): ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో కోటప్పకొండ తర్వాత అత్యంత ప్రాముఖ్యం కలిగిన రెండో శైవక్షేత్రం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం. ఐదు రోజులపాటు భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించడం ఈ ఆలయం ప్రత్యేకత. పచ్చని పొలాల మధ్య, పూర్తి గ్రామీణ వాతావరణంలో భక్తుల మానసిక ప్రశాంతతను చేకూర్చే ప్రాంతం కావడంతో ఇక్కడ భక్తుల ఆదరణ ఎక్కువగా ఉంటుంది. భక్తుల ఆదరణకు తగినట్లుగా ఈనెల 18న జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు గోవాడ గంగాపార్వతీసమేత బాలకోటేశ్వర స్వామి దేవస్థానం సర్వాంగసుందరంగా ముస్తాబవుతోంది.

ఏర్పాట్లు ముమ్మరం..

గోవాడ బాలకోటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు మహాశివరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో భారీగా తరలి రానున్న నేపథ్యంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఈమని అశోక్ రెడ్డి పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నారు. చలువ పందిళ్లు, వివిధ దర్శనాలకు ప్రత్యే క క్యూలైన్ల ఏర్పాటు, విద్యుద్దీకరణ పనులతో పాటు భక్తులకు తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వేమూరు నియోజకవర్గంలోని అమృతలూరు మండలంలోని గోవాడలో బాలకోటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తొలిరోజు దేవస్థా నం విద్యుత్ ప్రభను ఎత్తి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. బాలకోటేశ్వర స్వామి వారికి నిత్యం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తారు. మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 18వ తేదీన తెల్లవారు జామున 5.13 గంటలకు బాల కోటేశ్వర స్వా మి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్వామి వారు, అమ్మ వార్లకు పట్టు వస్త్రాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున దంపతులు సమర్పించనున్నారు. 20న సాయంత్రం స్వామి వారి రథోత్సవం, 21న తెప్పోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మహాశివరాత్రి ఉత్సవాలు కొన్ని దేవస్థానాల్లో 18వ తేదీన ఒక్క రోజే ఉత్సవాలు నిర్వహిస్తారు. అయితే గోవాడ గ్రామంలోని బాలకోటేశ్వర స్వామి దేవస్థానంలో 5 రోజులు ఉత్సవాలు కొనసాగుతాయని ఈవో అశోక్‌రెడ్డి తెలిపారు.

బజరంగ్ ఫౌండేషన్ సేవలు అమూల్యం

- పోలీస్ కుటుంబాలకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు అభినందనీయం
- శిబిర ప్రారంభోత్సవంలో గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్పీ సుప్రజ



కంటి పరీక్ష చేయించుకుంటున్న అడిషనల్ ఎస్పీ సుప్రజ, చిత్రంలో బజరంగ్ సీఈఓ అంబటి మురళీకృష్ణ



ఉచిత కంటి పరీక్ష, కళ్లజోళ్ల పంపిణీ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బజరంగ్ సీఈఓ అంబటి మురళీకృష్ణ తదితరులు

కొరిటిపాడు(గుంటూరు): నిజమైన సేవకు భాష్యం చెబుతూ, నిండైన మానవత్వం చాటుకుంటూ మెండైన సేవలందిస్తున్న బజరంగ్ ఫౌండేషన్ కృషి అనన్య సామాన్యమని గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) సుప్రజ అన్నారు. బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోలీసులు, వారి కుటుంబాల కోసం స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర పరీక్ష శిబిరాన్ని బుధవారం జిల్లా అడిషనల్ ఎస్పీ(క్రైం) అనిల్, జిల్లా అడిషనల్ ఎస్పీ(లా అండ్ ఆర్డర్) శ్రీనివాసరావులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సుప్రజ మాట్లాడుతూ బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో వినూత్న రీతిలో ఉన్నాయని కొనియాడారు. సమాజ హితం కోసం ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ, విద్యార్థుల కోసం కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు, తలసేమియా పీడితుల కోసం మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించిన ఫౌండేషన్ పోలీసుల కుటుంబాల కోసం ముందుకు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ వ్యక్తిత్వాన్ని, దయా హృదయాన్ని కొనియాడారు. భవిష్యత్తులో పోలీసుల కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

సీఎం వైఎస్ జగన్ స్ఫూర్తితోనే...

బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో చేపడుతున్న 'జగన్నామ సంక్షేమ సంవత్సరం' సేవా కార్యక్రమాల పరంపర కొనసాగుతోందని చెప్పారు. విధి నిర్వహణలో తమ జీవితాలను అంకితం చేస్తున్న పోలీసులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఏర్పాటు చేసిన నేత్ర వైద్య పరీక్ష శిబిరానికి భారీగా హాజరై, సద్వినియోగం చేసుకున్నందుకు పోలీసు కుటుంబాలకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్ఫూర్తితో ప్రారంభమైన 'బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరం'లో గ్రామీణ ప్రాంతాలకు సేవలను విస్తరించి, ఏడాది చివరి నాటికి 51 గ్రామాల్లో సంక్షేమ కార్యక్రమాలను పూర్తి చేసి సాధ్యమైనంత ఎక్కువమందిని భాగస్వాములను చేయాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో అనుక్షణం శ్రమించే పోలీసు సోదరులకు స్నేహహస్తాన్ని అందించడానికి బజరంగ్‌ఫౌండేషన్ సిద్ధంగా ఉందని, రాబోయే రోజుల్లో పోలీసు శాఖ ఏదైనా గ్రామంలో అవగాహన కార్యక్రమాలు లేదా సేవా కార్యక్రమాలు చేపట్టే సందర్భంలో ఆ బాధ్యతను బజరంగ్ ఫౌండేషన్ స్వీకరించడానికి ముందంజలో ఉంటుందని తెలిపారు. పోలీసు కుటుంబాలలోని మహిళలకు కూడా బజరంగ్ నారీ రుతువు కార్యక్రమం ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. 1056 మంది పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు కంటి పరీక్షలు చేయడం జరిగిందని, అవసరం ఉన్న వారికి ఈ నెల 22వ తేదీ సాయంత్రం 3.30 గంటలకు కళ్లజోళ్లను అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే బజరంగ్ నారీ రుతువు కింద 376 మంది మహిళా పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు శానిటరీ నాప్‌కిన్ల పంపకం చేయడం జరిగిందని వివరించారు. అనివార్య కారణాల వల్ల రాలేక పోయిన జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ప్రత్యేక అభినందనలు, సందేశాన్ని పంపించారని ఆయన తెలిపారు.

'కర్మయోగం' పోస్టర్ ఆవిష్కరణ



సినిమా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

చీరాల: కట్ట ప్రొడక్షన్ బ్యానర్‌పై నూతనంగా నిర్మిస్తున్న సినిమాకు సంబంధించిన టైటిల్‌తో పాటు పోస్టర్‌ను బుధవారం చీరాల ఇంజినీరింగ్ కాలేజీలో ఆవిష్కరించారు. చీరాల ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ పి.రవికుమార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వరికూటి అమృతపాణి, రిటైర్డు ఏసీపీ కట్టా రాజ్ వినయ్‌కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ పి.రవికుమార్ మాట్లాడుతూ సినిమా డైరెక్టర్ కట్టా జయ్ తన విద్యార్థి అని, చదువుతో పాటు మనకు ఆసక్తి ఉన్న రంగాల్లో కష్టపడి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. తన మొదటి సినిమా విడుదల సొంత ప్రాంతంలో చేయాలనే తలంపుతో ఇక్కడ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. చీరాలకు చెందిన యువకుడు సినిమా తీయడం హర్షణీయమని డాక్టర్ వి.అమృతపాణి అన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు, సినిమా యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ క్వారీయింగ్‌పై మైనింగ్, విజిలెన్స్ దాడులు



అక్రమ క్వారీయింగ్ చేస్తున్న ప్రాంతంలో మైనింగ్ విజిలెన్స్ అధికారులు

శేకూరు(చేబ్రోలు): అక్రమ క్వారీయింగ్‌పై ప్రజల నుంచి ఫిర్యాదుల మేరకు మైనింగ్, విజిలెన్స్, రెవెన్యూ, పోలీసు అధికారుల బృందం బుధవారం చేబ్రోలు మండలం శేకూరులో సంయుక్తంగా దాడులు నిర్వహించింది. మైనింగ్ విజిలెన్స్ ఏడీ కొండారెడ్డి, మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ సతీష్, ఆర్ఐ రాజేంద్ర, అశోక్, మైనింగ్ సర్వేయర్ వసుమతి, వీఆర్వో మధుబాబు, సచివాలయ సిబ్బంది, సర్వేయర్లు, పోలీసులు నిర్వహించిన దాడుల్లో రెండు ప్రొక్లెయినర్లు, ఐదు టిప్పర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. చేబ్రోలు మండలం శేకూరులో సర్వే నంబర్ 330, 335లోని భూముల్లో అనుమతులు లేకుండా అక్రమంగా క్వారీయింగ్ చేస్తున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ వేణుగోపాలరెడ్డి ఆదేశాల మేరకు రెండు రోజులుగా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అక్రమ క్వారీయింగ్ జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. బుధవారం అధికారుల బృందం జరిపిన దాడుల్లో రెండు పొక్లెయినర్లు, ఐదు లారీల్ని సీజ్ చేసి తెనాలిలో డిపోకు తరలించారు. సుమారు 50వేల క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను తవ్వకం చేసినట్లు అధికారులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ క్వారీయింగ్ చేస్తున్న శేకూరు గ్రామానికి చెందిన ఇద్దరిపై మైనింగ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మోర్తోట ముక్తేశ్వరుని ఆలయంలో చోరీ



నగదును అపహరించి బయట పడేసిన హుండీని పరిశీలిస్తున్న పోలీసులు

రేపల్లె రూరల్: గుర్తుతెలియని దుండగులు ఆలయంలో చొరబడి వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించిన సంఘటన మండలంలోని దక్షిణకాశీగా పేరుగాంచిన మోర్తోట ముక్తేశ్వరస్వామి ఆలయంలో చోటుచేసుకుంది. పట్టణ సీఐ విజయచంద్ర కథనం మేరకు మోర్తోట గ్రామంలో వేంచేసి యున్న ముక్తేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి ఆగంతకులు చొరబడి స్వామివారి వెండి రుద్రాక్షమాలను, హుండీలోని నగదును అపహరించారన్నారు. హుండీలో నగదు రూ.20వేల వరకు ఉండవచ్చని ఆలయ నిర్వాహకులు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఆలయంలో సీసీ కెమెరాల ఆపరేటింగ్ బాక్స్‌ను ధ్వంసం చేసి డేటా కార్డును సైతం దొంగిలించారన్నారు. క్లూస్ టీమ్ సహాయంతో ఆలయాన్ని పరిశీలించామని, ఆలయ పూజారి సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

పొలాల్లో గుర్తు తెలియని మృతదేహం

అద్దంకి రూరల్: మేదరమెట్ల – నార్కెట్ పల్లి నామ్ రహదారిపై ఉన్న అద్దంకి నుంచి మేదరమెట్ల వెళ్లే రహదారి పక్కన ఉన్న పొలాల్లో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనబడింది. స్థానికులు అద్దంకి స్టేషన్‌కు సమాచారం ఇవ్వటంతో సీఐ రోశయ్య సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం బాగా కుళ్లిపోయి ఎముకలు అన్ని బయటకు వచ్చాయి. చనిపోయి పడి ఉండటంతో శరీరాన్ని కుక్కలు పీక్కుతిని ఉంటాయని స్థానికులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని సీఐ తెలిపారు.

నిందితుల అరెస్ట్

వినుకొండ(నూజెండ్ల): భర్త హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వినుకొండ పట్టణ సీఐ బి.అశోక్ కుమార్ తెలిపిన వివరాలు... మసీదు మాన్యంలో శ్రీగిరి కుమార్(38), భార్య స్వాతి నివసం ఉంటున్నారు. అయితే భార్యాభర్తల మధ్య విభేదాలతో భార్య ఆమె ప్రియుడు మారుతిబాబు కలసి ఈ నెల 11వ తేదీ రాత్రి మెడకు తాడు బిగించి హత్య చేశారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వివాహేతర సంబంధానికి భర్త అడ్డువస్తున్నాడని పథకం ప్రకారం హత్య చేసినట్లు నిందితులు విచారణలో ఒప్పుకున్నారని వెల్లడించారు.

గ్రామ పంచాయతీ నిధులు గోల్‌మాల్

- రూ.12.50లక్షలు గుట్టు చప్పుడు కాకుండా మాయం
- పెదవి విప్పని మండల స్థాయి అధికారులు



వేటపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం

వేటపాలెం: మండల కేంద్రంలోని వేటపాలెం గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్వాకం కంచే చేనుని మేసిన చందంగా తయారైంది. గ్రామ పంచాయతీలో ఇంటి పన్నులు రూపంలో వసూలు చేసిన నిధులతో అధికారులు గ్రామాభివృద్ధి చేయాల్సి ఉంటుంది. అయితే సంబంధిత శాఖ సిబ్బంది గ్రామంలో ఇంటి పన్నుల రూపంలో వసూలు చేసిన లక్షల నిధులు గ్రామ పంచాయతీ ఖాతాకి జమ చేయకుండా గోల్‌మాల్ చేసిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామ, మండల స్థాయి అధికారులు నిందితులపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా మిన్నకుండి పోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీకి సంబంధించి 2020 ఏప్రిల్ నుంచి 2022 జూలై వరకు గ్రామంలో ఇంటి పన్నుల రూపంలో వసూలు చేసిన నగదులో రూ. 12.50 లక్షలు నిధులు పంచాయితీ ఖాతాకు జమ కాలేదు. అయితే పన్నుల వసూలు చేసినట్లు రశీదులు మాత్రం రాసి ఉన్నాయి. కానీ నగదు పంచాయతీకి జమ చేయకుండా సిబ్బంది గోల్‌మాల్ చేశారు. 2020 నుంచి రెండేళ్ల పాటు పంచాయతీకి పర్మినెంట్ కార్యదర్శి లేకపోవడంతో ఇన్‌చార్జి కార్యదర్శుల పాలనలో నడిచింది. ఆ సమయంలోనే నిధుల గోల్‌మాల్ జరిగిందని తెలిసింది. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విచారణ చేయాలని ఎంపీడీఓకి లేఖ రాశా

నేను వేటపాలెం గ్రామ పంచాయతీకి 8 నెలల కిందట బదిలీపై వచ్చాను. రికార్డులు పరిశీలించగా రూ. 12 లక్షలు నిధులు లెక్కలు తేలలేదు. దీనిపై 2020 డిసెంబరు నెలలో ఎంపీడీఓకి లేఖ ద్వారా తెలియజేశాను. దానిపై పూర్తిస్థాయిలో విచారణ జరగాల్సి ఉంది.

– హరిబాబు, పంచాయతీ కార్యదర్శి

కుమారుడి నుంచి రక్షణ కల్పించండి

- పోలీసులను వేడుకున్న వృద్ధురాలు
- ఇటీవల కొడుకు, కోడలి దాడిలో ఆస్పత్రిపాలై, చికిత్స అనంతరం ఇంటికి చేరినవైనం



అంబులెన్స్‌లోనే విలేకర్లతో మాట్లాడుతున్న జయమ్మ

మార్టూరు: కన్న కొడుకు దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితురాలు తన ఇంట్లోకి తాను వెళ్తానని.. కొడుకు, కోడలు నుంచి రక్షణ కల్పించాలంటూ బుధవారం స్థానిక పోలీసులను ఆశ్రయించింది. వివరాలు.. ద్రోణాదుల గ్రామానికి చెందిన నూతక్కి జయమ్మ (72)పై ఈ నెల 4వ తేదీన ఆమె కన్న కొడుకు వీరనారాయణ అత్యంత దారుణంగా దాడి చేయగా ఆమెను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన విషయం పాఠకులకు విదితమే. గుంటూరు వైద్యులు జయమ్మను పరీక్షించి వెన్నుపూస రెండు చోట్ల విరిగిందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఆమెకు ఆపరేషన్ చేసే వీలుకాదని, మూడు నెలల తరువాత చేయాలంటూ తెలిపినట్లు జయమ్మ వివరించింది. ఈ క్రమంలో 11 రోజుల చికిత్స అనంతరం బుధవారం రాత్రి జయమ్మ గుంటూరు నుంచి ద్రోణాదుల వెళ్తూ అంబులెన్స్‌తో పాటు స్థానిక పోలీస్టేషన్‌కు వచ్చింది. తాను, తన భర్త కలిసి నిర్మించుకున్న ఇంట్లోకి తనను వెళ్లకుండా తన కుమారుడు వీరనారాయణ తిరిగి దాడి చేసే ప్రమాదమున్నందున తనకు రక్షణ కల్పించాలని ఆమె విజ్ఞప్తి చేసింది. ఎస్ఐ కమాలాకర్ ఇరువర్గాలతో చర్చలు జరుపుతున్నారు.

గిరిజనుల అభ్యున్నతికి సీఎం కృషి

- ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్
- వైఎస్సార్ సీపీ గిరిజన విభాగం ఆధ్వర్యంలో సేవాలాల్ జయంతి వేడుకలు



సేవాలాల్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్

పట్నంబజారు: గిరిజనుల అభ్యున్నతికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ చెప్పారు. వైఎస్సార్ సీపీ గిరిజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ ఆధ్వర్యంలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి వేడుకలు బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ కొందరు మహనీయులు చరిత్ర పుటల్లో అవతారపురుషులుగా, ఆరాధ్య దైవాలుగా నిలుస్తారని, సేవాలాల్ సైతం ఆ కోవకు చెందిన వారేనని కొనియాడారు. బంజారా జాతి ప్రజల శ్రేయస్సు కోసం ఆయన పాటుపడ్డారని తెలిపారు. పార్టీ గిరిజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్‌నాయక్ మాట్లాడుతూ సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. అనంతరం సంప్రదాయ తలపాగాను ధరించి, నంగారాను మోగించి, సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భోగ్ భండారో కార్యక్రమాన్ని నిర్వహించి, బంజారా మహిళలు సంప్రదాయ దుస్తులతో నృత్యం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బత్తుల దేవానంద్, సోషల్ వెల్ఫేర్ బోర్డ్ డైరెక్టర్ గనిక ఝాన్సీ, కార్పొరేటర్ బూసి రాజలత, పార్టీ గిరిజన విభాగం నేతలు దనావత్ వెంకటేశ్వర్లు నాయక్, రమావత్ భిక్కునాయక్, రమావత్ అంజినాయక్, కేతావత్ రూప్లా నాయక్ పాల్గొన్నారు.